క్లుప్తంగా

నేటి నుంచి అచ్యుతాపురంలో రీ సర్వే

గోకవరం: అచ్యుతాపురం గ్రామంలో బుధవారం నుంచి జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షణ పథకంలో భాగంగా రీ సర్వే నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని రైతులు ఆధార్, పాస్‌పుస్తకం, దస్తావేజులు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లు రెండు సెట్లతో భూ సర్వే టీం సభ్యులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయం 10.30 గంటలకు గ్రామసభ జరుగుతుందని రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని సందేహాలను నివృతి చేసుకోవాలన్నారు.

అనపర్తి తహసీల్దార్‌గా సరస్వతి


తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సరస్వతి

అనపర్తి: అనపర్తి మండల తహసీల్దార్‌గా వై.సరస్వతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం ఏఓగా పనిచేసిన ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో అనపర్తి తహసీల్దార్‌గా పనిచేసిన కె.రాజ్యలక్ష్మి చాగల్లు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సరస్వతికి కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

మధురపూడి: కోరుకొండ ఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో పునీత పాదువా అంథోనీ వారి పండగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాస్టర్ కడారి మాణిక్యం మాట్లాడుతూ క్రీస్తు బోధనలు మానవాళికి స్ఫూర్తిదాయకమన్నారు. ఉపదేశి బెల్లపు డేవిడ్, బెల్లపు మేరీవిజయ, పాతగొలుసుల అమ్మాజీ, శామ్యూల్, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం వైశాఖ మాసం దశమి సందర్భంగా భారీగా అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ అన్నసమారాధన నిర్వహించింది.

కొనసాగుతున్న 144 సెక్షన్

గోకవరం: తిరుమలాయపాలెం గ్రామంలో పోలీసులు విధించిన 144 సెక్షన్ కొనసాగుతుంది. గ్రామంలో ఓ వర్గం సభ్యులు అనుమతులు లేకుండా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంతో పోలీసులు విగ్రహాన్ని తొలగించారు. ఈ క్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గ్రామంలో 144 సెక్షన్ అమలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోకి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

మూడు గ్రామాల్లో గ్రావెల్ రోడ్ల నిర్మాణం

రంగంపేట: కోటపాడు పంచాయతీ పరిధిలోని కె.కోటపాడు, పి.కోటపాడు, రామేశంపేట గ్రామాల్లో గ్రామ సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ ఆధ్వర్యంలో గ్రావెల్ రోడ్ల నిర్మాణం జోరుగా సాగుతుంది. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ గవరసాని రాజు మాట్లాడుతూ కె.కోటపాడు, పి.కోటపాడు గ్రామాల్లోని రోడ్లు గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అధ్వానంగా తయారయ్యాయని దీంతో గ్రావెల్ వేసి రోడ్డును లెవలింగ్ చేయించామన్నారు. రామేశంపేట జగనన్న కాలనీకి వెళ్లే దారి లేకపోవడంతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు.

విద్యార్థులకు రాగి జావ పంపిణీ


మర్రిపూడి హైస్కూల్లో రాగిజావ తాగుతున్న విద్యార్థులు

రంగంపేట: మండలంలోని మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం రాగిజావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ వేము చిరంజీవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనంతో పాటు రాగిజావను కూడా మెనూలో చేర్చి అందించడం గొప్ప విషయమన్నారు. ప్రతి విద్యార్థి రాగిజావ తాగాలని సూచించారు.

జూదరుల అరెస్ట్

సీతానగరం: రఘుదేవపురం శివారులో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్సై సమర్పణరావు మంగళవారం తెలిపారు. వారి నుంచి రూ.10 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, నిందితులను కోర్టులో హాజరుపర్చుతామని ఏఎస్సై వివరించారు.

సెగలు... భగభగలు

- తగ్గని ఎండలు... తీరని వెతలు
- పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైనే..
- రాత్రి వేళల్లోనూ తప్పని ఉక్కబోత


దివాన్‌చెరువు వద్ద జాతీయ రహదారిపై చెట్ల నీడకు చేరిన భారీ వాహనాలు

రాజానగరం: నడినెత్తిన సూరీడు చుర్రుమనిపిస్తున్నాడు.. అంతకంతకూ తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు.. రోహిణీ కార్తె వెళ్లిపోయింది. మృగశిర కార్తె ప్రవేశించి ఐదు రోజులవుతున్నా ఏమాత్రం ఎండలు తగ్గడం లేదు. పగటి పూట ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు పైబడి నమోదుతున్నాయి. రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. గత శనివారం నుంచి మంగళవారం వరకూ రాజానగరం నియోజకవర్గంలో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే 42.4, 44.2, 44.3, 42.5 డిగ్రీల చొప్పున, అలాగే అనపర్తి నియోజకవర్గంలో 42.1, 44.5, 44.5, 42.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నెల 9 నుంచి మృగశిర కార్తె ప్రవేశించడంతో ఎండలు తగ్గుతాయని అంతా భావించారు. అయినా రోహిణీ ప్రభావం ఇప్పటికీ ఏమాత్రం తగ్గకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే వేడి మొదలవుతోంది. సాయంత్రం 6 గంటలైనా తగ్గడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప బయటకు వచ్చేందుకు ప్రజలు సాహసించడం లేదు. ఒకవేళ తెగించి వెళితే వడగాడ్పులకు అవస్థలు పడుతున్నారు.

చెట్ల నీడకు వాహనాలు

రాజమహేంద్రవరం నుంచి రాజానగరం జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలతో కిక్కిరిసిపోతోంది. అయితే ఈ దారిలోనూ వాహనాలు అంతంతమాత్రంగానే వెళ్తున్నాయి. ఎండకు భయపడి ఈ మార్గంలో వెళ్లే వాహనాల డ్రైవర్లు ఇక్కడి చెట్ల కింద సేద తీరుతున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4 గంటల వరకు జాతీయ రహదారిపై చెట్ల నీడ కనిపిస్తే చాలు ఆయా వాహనచోదకులు తమ వాహనాలను ఆపి, కాస్త ఉపశమనం పొందుతున్నారు. ఈ వాతావరణంలో ఉక్కబోతను తట్టుకుని తాము వాహనాలను నడిపినా గాని, ఇంజిన్ వేడి ఎక్కువైతే కష్టమని చెట్ల నీడన ఆగాల్సి వస్తుందని వారు తెలిపారు.

సాగని ఏరువాక

సాధారణంగా మృగశిర కార్తెలో రైతులు ఏరువాకతో ఖరీఫ్ వరి సాగుకు శ్రీకారం చుడతారు. అయితే వరుణుడు కరుణించకపోవడంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించడం కూడా జాప్యమవటంతో తొలకరి వర్షాలు కురవక రైతాంగం ఆకాశంలో మబ్బులు ఎప్పుడు వస్తాయా, చినుకులు ఎప్పుడు పడతాయా అని ఆశగా ఎదురు చూస్తోంది.

వ్యాపారాలకూ బ్రేక్

ఎండల తీవ్రతను తట్టుకోలేక జాతీయ రహదారిపై లాలాచెరువు, దివాన్‌చెరువు, రాజానగరం వంటి ప్రధాన వ్యాపార, వాణిజ్య కూడళ్లలో దుకాణాలను కూడా మధ్యాహ్నం రెండు, మూడు గంటల పాటు మూసివేస్తున్నారు. రాజానగరం, కోరుకొండ, సీతానగరం వంటి మండల కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. సాయంత్రం 5 గంటలు దాటితేనే గాని జనం రోడ్ల పైకి రావడం లేదు. దుకాణాలు తెరవడం లేదు. చివరకు వేసవిలో జనం దాహాన్ని తీర్చే కూల్ డ్రింక్ షాపులు కూడా ఈ సమయంలో మూతపడుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

సాగులో అన్నదాతలకు సహకరిద్దాం


వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ క్రొవ్విడి సర్రాజు

మధురపూడి: ఖరీఫ్ సాగులో అన్నదాతలకు అన్నివిధాలా సహకారం అందజేయాలని వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ క్రొవ్విడి సర్రాజు అన్నారు. మంగళవారం కాపవరం ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాలులో వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్, ఈకేవైసీలను సక్రమంగా నిర్వహించాలన్నారు. రుతు పవనాల రాక ఆలస్యం కావటంతో కోరుకొండలో సాగు పనులు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. పుష్కర కాలువ నీరు సాగుకు ఉపయోగపడేలా చర్యలు చేపడతామన్నారు. పలువురు వీఏలు అడిగిన అనుమానాలను నివృత్తి చేశారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇందులో భాగంగానే విత్తనాలు, ఎరువులను ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నారు. వైఎస్సార్ యంత్ర సేవ పథకానికి ఎంపికైన రైతుల వివరాలు ఆర్‌బీకేల్లో ఉంచాలన్నారు. ఏడీ బీకే మల్లిఖార్జునరావు మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణ పూర్తయ్యిందని, దానికనుగుణంగా సాగు చేయాలనే సూచనలు రైతులకు తెలియజేయాలన్నారు. డ్రోన్ వ్యవసాయం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని, ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ ఇస్తోందన్నారు. ఆసక్తి గలవారు వెళ్లవచ్చన్నారు. ఈ శిక్షణకు వెళ్లిన నర్సాపురం సర్పంచ్ కడియాల పాపారావును సమావేశం అభినందించింది. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, సర్పంచుల సమాఖ్య కోరుకొండ మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, ఏవో గౌరీదేవి, ఉద్యాన శాఖ ఏవో రినీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు

పెదపూడి: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఆదేశాల మేరకు వైఎస్సార్ కడప క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు విద్యార్థుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.విజయభాస్కర్ మంగళవారం తెలిపారు. జిల్లాలోని 21 మండల కేంద్రాల్లో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకూ ఎంపీడీఓల పర్యవేక్షణలో మండల స్థాయి ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ నెల 16న పెదపూడి గాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో బాలురు, బాలికలకు ఎంపికలు జరుగుతాయని చెప్పారు. నాలుగో తరగతిలో ప్రవేశాలకు 2014 ఆగస్టు 1 నుంచి 2015 జులై 31 తేదీల మధ్యలో జన్మించినవారు అర్హులన్నారు. ఐదో తరగతిలో ప్రవేశాలకు 2013 ఆగస్టు 1 నుంచి 2014 జులై 31 తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 89196 42248 నెంబరులో సంప్రదించాలన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ


విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పాతవూరులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనబడి నాడు-నేడు పథకం ద్వారా కార్పొరేట్ హంగులతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నారన్నారు. సీబీఎస్‌ఈ సిలబస్ అమలు, జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి తదితర పథకాలను పక్కాగా అమలు చేస్తున్నారని తెలిపారు. గత టీడీపీ పాలనలో సర్కారు బడుల్లో కనీస వసతులు కూడా ఉండేవి కావన్నారు. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపడడంతో సర్కారు బడులపై తల్లిదండ్రులకు నమ్మకం పెరిగిందన్నారు. బాలుర ఉన్నత పాఠశాలను సుమారు రూ.3.50 కోట్ల వ్యయంతో పునఃనిర్మించినట్లు తెలిపారు. మండల పరిధిలో మొత్తం 4,795 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆయన విద్యార్థులకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఎంఈఓ కె.స్వామినాయక్, పాఠశాల హెచ్‌ఎం పులగం వెంకటరెడ్డి, సర్పంచ్ వారా కుమారి, ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి, ఇంచార్జ్ తహసీల్దార్ కె.శశిధర్, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహనబాలకృష్ణారెడ్డి, రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.


బిక్కవోలులో..

బిక్కవోలు: బిక్కవోలు ఉన్నత పాఠశాలలో ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను సోమవారం అందజేశారు. మెళ్లూరు ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళ సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, సర్పంచ్ సాయిరాం, వైస్ సర్పంచ్ కొమ్మన ఆనంద్, పందలపాక ఉన్నత పాఠశాలలో సొసైటీ అధ్యక్షుడు సత్తి హరి ప్రసాద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, కొంకుదురు ఉన్నత పాఠశాలలో సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజాలు విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు.

జి.మామిడాడ, పెద్దాడల్లో...

పెదపూడి: జి.మామిడాడ, పెద్దాడ తదితర గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యతతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కేతా తులసి తదితరులు


మెళ్లూరులో విద్యార్థులతో జిల్లా మహిళ సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి

ప్రీ స్కూల్ విద్యపై అవగాహన


ప్రీ స్కూల్ విద్యపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రకాశంనగర్: స్థానిక లింగంపేట-2 అంగన్‌వాడీ కేంద్రంలో సమగ్ర శిశు సంక్షేమ అధికారి సీహెచ్ నరసమ్మ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ జన భాగీదారి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ విద్యపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే నాణ్యమైన భోజనంతో పాటు ఉన్నతమైన విలువలతో విద్య ఎలా అందిస్తున్నారో వివరించారు. ప్రభుత్వ పాఠశాల ప్రాముఖ్యతను తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ మున్నీ, సహాయకురాలు ఎం.పుష్పకుమారి, జీఎల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ


విద్యార్థులతో గౌతమ ఘాట్ వాకర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం గౌతమ ఘాట్‌లో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం జరిగింది. శిక్షకుడు మాస్టర్ కర్రి నాగిరెడ్డి ఆధ్వర్యంలో కరాటే శిక్షణ విజయవంతంగా ముగిసింది. శిక్షణ పొందిన 60 మంది విద్యార్థినీ విద్యార్థులకు గౌతమ ఘాట్ వాకర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కీర్తి బాబ్జి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రస్తుత రోజుల్లో ఆడపిల్లలు కచ్చితంగా కరాటే వంటి ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలని అన్నారు. వైస్ ప్రెసిడెంట్ కొంటెపు వెంకన్నబాబు, సెక్రటరీ గునిశెట్టి విజయకిరణ్ పాల్గొన్నారు.

18న బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికలు

ప్రకాశంనగర్: ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో జరుగనున్న అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనే అండర్-18 జిల్లా బాలుర జట్టు ఎంపికలు 18న సాయంత్రం 4 గంటల నుంచి జరుగుతాయి. ఆ రోజు స్థానిక ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఈ ఎంపికలు ఉంటాయని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శివప్రసాద్, ఎన్‌వీవీ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2005 జనవరి 1 తర్వాత పుట్టిన విద్యార్థులు ఈ ఎంపికలకు అర్హులన్నారు. విద్యార్థులు సంబంధిత పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ఘనంగా వీరభద్రస్వామి కల్యాణం


వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

పెదపూడి: మండలంలోని పుట్టకొండలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం మంగళవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కమలాకర్ ఉదయం 10 గంటలకు స్వామి వారి కల్యాణ క్రతువు ప్రారంభించారు. కనుల పండువగా జరిగిన కల్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించారు. మధ్యాహ్నం 3 గంటలకు స్వామి వారి రథోత్సవం జరిగింది. ఆలయం వద్ద గ్రామస్తుల సహకారంతో పెద్దఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయీ బ్రాహ్మణులకు పాలక మండలిలో సభ్యత్వం కల్పించినందుకు గాను నలుగురు నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్యే శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, గ్రామ సర్పంచ్ వల్లు వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ వల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో నిధుల కేటాయింపు


ఎంపీడీఓ పద్మాజ్యోతిని సత్కరిస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి, ఎంపీటీసీలు

గోకవరం: మండలంలో అన్ని ఎంపీటీసీల పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయిస్తామని ఎంపీపీ సుంకర శ్రీవల్లి అన్నారు. ఎంపీడీఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.పద్మజ్యోతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ఆధ్వర్యంలో పలువురు ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అన్ని ఎంపీటీసీల పరిధిలో డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు ప్రాధాన్యతా క్రమంలో మండల పరిషత్ నిధులు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, నరాలశెట్టి నర్శయ్య, ఎంపీటీసీలు తోలేటి రమ్యశ్రీ, నరాలశెట్టి గౌతమి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో పురోభివృద్ధి

- ఫ్లైఓవర్ నిర్మాణంలో ప్రగతి భేష్
- ఎంపీ మార్గాని భరత్‌రామ్


కోటిలింగాలపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ప్రధాన జంక్షన్ మోరంపూడి వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనుల్లో పురోభివృద్ధి సాధించామని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. మంగళవారం పార్టీ శ్రేణులతో కలసి ఈ ఫ్లైఓవర్ వంతెన పనులను ఆయన నిశితంగా పరిశీలించారు. ఒక్కో విభాగం పనులను గురించి కూలంకుషంగా కాంట్రాక్టర్ సురేష్ గౌడ్‌ను ఎంపీ ప్రశ్నించారు. వారం రోజుల్లో జరిగిన పనుల పురోభివృద్ధిని ఎంపీ స్వయంగా పరిశీలించారు. పిల్లర్ల నిర్మాణంలో పురోభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుందని ఎంపీకి కాంట్రాక్టర్ తెలిపారు. అయితే డ్రైనేజీ పనుల్లో జాప్యంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. రోడ్డు కటింగ్ అనుమతి కావాలని, అందుకు ట్రాఫిక్ పోలీస్ అధికారులను కోరినట్లు కాంట్రాక్టర్ సురేష్ వివరించారు. ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులకు ఎంపీ ఫోన్ చేసి పర్మిషన్ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ట్రాఫిక్ డీఎస్పీ సంఘటనా స్థలానికి వచ్చి ఎంపీ భరత్‌తో మాట్లాడారు. డ్రైనేజీ నిర్మాణానికి సహకరించాలని ఆయన్ని ఎంపీ భరత్ కోరారు. కాగా రాత్రి సమయాల్లో ఈ జంక్షన్ వద్ద విద్యుత్ లైట్లు లేకపోవడంతో వాహనదారులకు ఇబ్బందిగా ఉంటోందని, అక్కడ పెద్ద లైట్లు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌కు ఎంపీ సూచించారు. ఈ సంవత్సరం చివరి నాటికి బ్రిడ్జి పనులు పూర్తవ్వాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. ఎఫ్‌ఓబీ పనుల పరిశీలన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వారం రోజుల్లో చూస్తే పనుల్లో పురోభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికల్లా పనులు పూర్తయితే వచ్చే కొత్త సంవత్సరం నాటికి ఈ వంతెన ప్రజలకు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చెక్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో తాగునీటి సరఫరాకు ఇబ్బంది రాకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక కోటిలింగాల పేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సుమారు రూ.3 కోట్లతో చేపడుతున్న ఎలెవేటెడ్ లెవెల్ సర్వీసు రిజర్వాయర్ (ఈఎల్‌ఎస్‌ఆర్)కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.06 కోట్లతో నిర్మించే ఈ రిజర్వాయర్‌తో 34, 40, 41 డివిజన్‌లకు చెందిన సుమారు 20 వేల మందికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంకిస భవానీప్రియ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర పాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు, ఈఈ కనకారావు, ఏఈ భవానీ, పాలిక శ్రీను, డాక్టర్ అనుసూరి పద్మలత, మజ్జి అప్పారావు, నక్కా శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్య రానీయొద్దు


మోరంపూడిలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: మోరంపూడిలో నిర్మించిన అంతర్గత కాలువలను నేషనల్ హైవేలో నిర్మించిన ప్రధాన కాలువలోకి అనుసంధానించి, మురుగు సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పరిశీలనలో భాగంగా మంగళవారం స్థానిక మోరంపూడిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. సిబ్బందికి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కాలువల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి నీటి పారుదలకు ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. మోరంపూడిలో నిర్మించిన అంతర్గత కాలువలను ప్రధాన కాలువకు అనుసంధానం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ సత్యప్రసాద్

కంబాలచెరువు: స్థానిక సత్య కిడ్నీ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ రెండో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక తిలక్‌రోడ్డులోని ఆసుపత్రి ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యురాలజీ నిపుణుడు డాక్టర్ ఎ.సత్యప్రసాద్, హాస్పటల్ ఫిజీషియన్ డాక్టర్ జీఆర్ చైతన్య వైద్య సేవలు అందించారు. యురాలజీ, జనరల్ మెడిసిన్‌కు సంబంధించి అవుట్ పేషెంట్ విభాగానికి వచ్చిన రోగులకు ఉచితంగా సేవలు అందించారు. అలాగే సీరమ్ క్రియేటినిన్, బ్లడ్ యూరియా, బ్లడ్ గ్లూకోజ్, హెచ్‌బీ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ప్రొస్టేట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షను కూడా ఉచితంగా చేశారు. డాక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ హాస్పటల్ ఏర్పాటు చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక


జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

ప్రకాశంనగర్: జిల్లా జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శీలం వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా ఎంవీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా సాయిరాం, కోశాధికారిగా రామ్మూర్తి రాజు ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

ప్రకాశంనగర్: ఇండోనేపాల్ కరాటే ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో వైజాగ్ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో అండర్-10, 19 విభాగాల్లో పలువురు విద్యార్థినీ విద్యార్థులు ప్రతిభ చాటారని కరాటే మాస్టర్ పిల్లి అరుణ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్.శ్రీలక్ష్మీలత, పి.శ్రీవిద్య, స్వాతిలక్ష్మి, బి.కీర్తన, సీహెచ్ కార్తిక్, కె.లక్ష్మీభవాని, జి.నిశ్చల్, ఎం.నవదీప్, పి.శ్రీరామ్, వి.పల్లవి బంగారు పతకాలు సాధించారన్నారు. ఎస్.మనోహర్ సాయి, దుర్గ, జాక్వస్స్, వెంకట కావ్యశ్రీ, సీహెచ్ మోక్షిత వెండి పతకాలు దక్కించుకున్నారని అన్నారు. ఆర్.జైన్ కార్లోస్, సీహెచ్ జైదీప్, ఆర్.అఖిల, ఎల్.వైష్ణవి, పి.పూజ కాంస్య పతకాలను సాధించారని, విజేతలను డీఈవో అబ్రహం అభినందించారని చెప్పారు.